

మాట్లాడుతున్న ఆదివాసీ, దళిత, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు

# కర్రెగుట్టలపై దాడులు ఆపాలి

**ఆదివాసీ, దళిత, గిరిజన, ప్రజా సంఘాల సమన్వయ కమిటీ నాయకులు**

ములుగు, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ) : మావోయిస్టు వ్యవస్థను రూపుమాపేందుకు, ఏజెన్సీ ప్రాంతంలోని విలువైన అటవీ సంపదను దోచుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ, దళిత, గిరిజన, ప్రజా సంఘాల సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న కర్రెగుట్టలపై వారం రోజులుగా ఆపరేషన్ కగార్‌లో భాగంగా సైనిక బలగాలు అధునాతన ఆయుధాలు, బాంబు దాడులు చేస్తున్నదన్నారు. 2026 మార్చి నాటికి మావోయిస్టులను అంతం చేయడమే లక్ష్యంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ఈ ఆపరేషన్‌కు తెరలేపాడన్నారు. ప్రభుత్వం దేశంలో పేదరికాన్ని నిర్మూలించడానికి డెడ్‌లైన్లు పెట్టుకోవాలి.. కానీ, ఆదివాసీ తెగలపై తూటాల వర్షం కురిపించేందుకు డెడ్‌లైన్లు పెట్టుకోవడం రాజ్యాంగ విరుద్ధమని తెలిపారు. భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం ఆదివాసీలు నివసించే ప్రాంతంలో పోలీసులకు ప్రవేశం ఉండదని తెలిపారు. మావోయిస్టులు శత్రు దేశం వారు కాదని, మొన్న జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో పర్యాటకులు చనిపోతే దేశ ప్రజలు ఆ దాడిని ఖండించారని అన్నారు. ప్రస్తుతం కర్రెగుట్టలపై సాగుతున్న ఆపరేషన్ కగార్‌ను బయట ప్రపంచానికి తెలియకుండా సాగిస్తున్నారని, దీనిని ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించారని అన్నారు. సైనిక చర్యతో నిరాయుధులైన ఎంతోమంది ఆదివాసీలు, మహిళలు, చిన్న పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపరేషన్ కగార్ పేరుతో అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసీలను పోలీసు బలగాలు ఖాళీ చేయించారని, ఇదిఎంత వరకు సమంజసమన్నారు. నిన్న ఎల్కతుర్తి సభలో లక్షలాది మంది ప్రజల సమక్షంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక అడుగు ముందుకేసి ఆపరేషన్ కగార్‌ను రద్దు చేయాలని, ఈ విషయమై తీర్మానం చేసి కేంద్రానికి లేఖ రాస్తామని మద్దతు తెలుపడం హర్షణీయమన్నారు. అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి కేబినెట్ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపి ఆపరేషన్ కగార్‌ను అడ్డుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపి తక్షణమే శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న ములుగులో శాంతిర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు మెమోరాండం సమర్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ నాయకులు వట్టం ఉపేందర్, రమణాల లక్ష్మయ్య, కబ్బాక శ్రావణ్‌కుమార్, సోమ రామ్మూర్తి, గంపిడి వెంకటేశ్వర్లు, గోర్ సభ నాయకులు జయసింగ్ రాథోడ్, మంగీలాల్‌నాయక్, ఎమ్మార్పీఎస్ నాయకులు గుగ్గిళ్ల పీరయ్య, జన్ను రవి, నెమలి నర్సయ్య, ప్రజా సంఘాల నేత ముంజాల భిక్షపతిగౌడ్, గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు సమ్మయ్య రాథోడ్, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అర్రెం లచ్చుపటేల్, ఆదివాసీ నాయకులు కొప్పుల రవి, సునిల్, కన్నయ్య, కృష్ణ, బాలకృష్ణ, జనార్దన్, వీరభద్రం పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను ఉపసంహరించుకోవాలి

మహాముత్తారం, ఏప్రిల్ 28 : కర్రెగుట్ట ప్రాంతంలో కొనసాగుతున్న నరమేధాన్ని ఆపాలని, ఆదివాసీ జాతిని హననం చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్‌కు సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కర్రెగుట్ట సరిహద్దు ప్రాంతంలో నివాసం ఉంటున్న ఆదివాసీ, గిరిజనులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయానక వాతావరణంలో మగ్గుతున్నారన్నారు. ఇప్పటికే రెండు బేస్ క్యాంపుల నుంచి తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని ఆదివాసీలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్నారు. అమాయకులైన వారిని కాల్చి చంపి మావోయిస్టులుగా చిత్రించే ప్రమాదం ఉన్నదన్నారు. వెంటనే సాయుధ పోలీస్ బలగాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామర గట్టయ్య, సీపీయూఎస్ఐ జిల్లా కార్యదర్శి వావిలాల లక్ష్మణ్, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక జిల్లా కో కన్వీనర్ అయితె బాపు, తెలంగాణ అసంఘటిత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దాసరి రమేశ్, అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా నాయకుడు రామగిరి రాజు పాల్గొన్నారు.

## కానిస్టేబుల్ రాజుకు రివార్డు

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 28 : జిల్లా సీసీఎస్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఉప్పాల రాజుకు మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగంగా డీజీపీ డాక్టర్ జితేందర్ రివార్డు అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం రాజును ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.



డీజీపీ చేతులు మీదుగా రివార్డు అందుకుంటున్న కానిస్టేబుల్ రాజు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**సమ్మర్ స్పెషల్ ఆఫర్**

★ శ్రీశైలి బ్యూటి పార్లర్ Only అడ్మిషన్ ఫీ 2,000/- with సర్టిఫికెట్ ఫ్రీ, బ్యూటీషన్, మగ్గం వర్క్ కోర్స్ నేర్పించబడును. వెంటనే సంప్ర: Call Me: 9989060668.
NTW-15698

**WANTED**

★MS Office & Multimedia Teaching చేయుటకు Trainer (Full Time / Part Time) కావలెను. Monthly Salary Rs. 15,000/-. Vidyarthi Computers. Cell: 6309013619
NTW-6586

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

**For Classified Ads**
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565



భారీ చెట్లను తొలగిస్తూ ట్రాక్టర్లలో జేసీబీతో మట్టిని నింపుతున్న దృశ్యం



రోడ్డుకు అడ్డంగా ఎడ్ల బండిని పెట్టిన గ్రామస్తులు

# ఏజెన్సీలో మట్టి మాఫియా !

- ప్రభుత్వ భూమిలో విచ్చలవిడిగా తవ్వకాలు
- భారీ వృక్షాలు నేలమట్టం చేసి మరీ తరలింపు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు
- ప్రశ్నించిన వారికి బెదిరింపులు

కన్నాయిగూడెం, ఏప్రిల్ 28 : మండలంలోని ఏజెన్సీ ప్రాంతంలో మట్టి మాఫియా చెలరేగుతున్నది. రెవెన్యూ అధికారుల అండదండలతో ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా అనుమతులు తీసుకొని భారీ వృక్షాలను సైతం నేలమట్టం చేసి జేసీబీ సాయంతో మట్టిని తరలిస్తున్నారు. మండలకేంద్రం సమీపంలోని గుర్రేవుల ఎస్సీ కాలనీ గుండా రోజూ ట్రాక్టర్లు వందలకొద్ది మట్టి ట్రిప్పులను తరలిస్తున్నాయి. కాలనీ నుంచి అతివేగంగా వెళ్తుండడంతో ఇండ్లలోకి దుమ్ము, దూళి చేరి ఆహార పదార్థాలపై పడుతుండడంతో సోమవారంకాలనీ వాసులు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. ఉదయం ఆరు నుంచి రాత్రి 7 గంటల వరకు ఒక దాని వెంట ఒకటి వస్తుండడంతో తాము రోడ్డుపైకి వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. ఎదురుగా వాహనం వస్తే కిందకు దిగే పరిస్థితి లేదని చెప్పారు. దీంతో చేసేది ఏమీ లేక ఎడ్లబండిని రోడ్డుకు అడ్డుగా పెట్టి మట్టి ట్రాక్టర్లు రాకుండా అడ్డుకున్నామని కాలనీవాసులు చెప్తున్నారు. అధికారులు తమ కాలనీని సందర్శించి సమస్యను పరిష్కరించే వరకూ మట్టి ట్రాక్లర్లను తిరగనియ్యమని కాలనీ వాసి వాసంపెల్లి రాములు చెప్పారు. గ్రామస్తులు ట్రాక్టర్లను అడ్డుకోవడంతో మట్టి మాఫియా జేసీబీ సాయంతో మరో దారిని ఏర్పాటు చేసుకున్నారు. ఈ విషయంపై ఆఐ గణేశ్‌ను 'నమస్తే తెలంగాణ' వివరణ కోరింది.' గ్రామంలో వంద ట్రాక్టర్లు ఉన్నాయా.. నేను వస్తా చూపిస్తావా.. వంద ట్రిప్పులు కాకపోతే వెయ్యి ట్రిప్పులు చెప్పండి' అంటూ మట్టి మాఫియాకు వత్తాసు పలుకుతూ సమాధానం ఇచ్చారు. రైతులకు పర్మిషన్ ఇవ్వద్దా.. భూములు లెవలింగ్ చేసుకోవద్దా అంటూ దురుసుగా మాట్లాడారు. 'ఈ రోజు నేను వెంకటాపూర్‌లో ఉన్నాను.. ఎండలో తిరిగాను బాగుండదు' అంటూ హెచ్చరించే ప్రయత్నం చేశారు. కాగా, తహసీల్దార్ వేణుగోపాల్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరగా 'నేను వచ్చిన తర్వాత ఎంక్వైరీ చేయిస్తాను. ప్రభుత్వ భూమిలో తవ్వకాలు చేపట్టారా? పట్టా భూమిలోనా? ఎన్ని చెట్లను తొలగించారు? ఎంత మేరకు పర్యావరణ నష్టం జరిగిందనేది ఫీల్డ్ విజిట్ చేసి చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.

## భూ సమస్యల పరిష్కారానికే కొత్త చట్టం

**భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ**



పలిమెల : మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

పలిమెల/ మహదేవపూర్, ఏప్రిల్ 28 : భూ సమస్యలు పరిష్కారానికి భూ భారతి చట్టం సులభతరంగా ఉంటుందని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. సోమవారం పలిమెల, మహదేవపూర్ మండలకేంద్రంల్లోని రైతు వేదికల్లో కొత్త చట్టంపై కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రైతులకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 4 జిల్లాల్లో 4 మండలాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అలాగే మన జిల్లాలోని 12 మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వచ్చే నెలలో మన జిల్లాలోని ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రైతు సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ చట్టంపై ప్రజలు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. క్షేత్రస్థాయిలో విచారణ చేసి సమస్యలకు పరిష్కార మార్గం చూపుతారన్నారు. అన్ని వర్గాల వారు చట్టంపై అవగాహన పెంచుకొని వారి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సదస్సులో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, తహసీల్దార్లు అనిల్, ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీడీవోలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఏడీఏ శ్రీపాల్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, పీఏసీఎస్ చైర్మన్ చల్ల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

## తైక్వాండోలో సంతోష్‌కుమార్‌కు కాంస్య పతకం

ఏటూరునాగారం, ఏప్రిల్ 28 : అంతర్జాతీయ తైక్వాండ్ పోటీల్లో గిరిజన ఉపాధ్యాయుడు ప్రతిభ కనబర్చి కాంస్య పతకాన్ని సాధించారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఈనెల 26,27తేదీల్లో ఇండియా, నేపాల్ దేశాల అంతర్జాతీయ తైక్వాండ్ పోటీలు నిర్వహించారు. కాగా, ఈ పోటీల్లో తాడ్వాయి మండలం కామారం గిరిజన సంక్షేమశాఖ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మైపతి సంతోష్‌కుమార్ 61 కేజీల విభాగంలో పాల్గొని ప్రతిభ కనబర్చి కాంస్య పతకాన్ని సాధించారు. కోచ్ పాయం నెశాంత్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ఆయన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా రాణించాడు. సంతోష్‌కుమార్‌ను సహ ఉపాధ్యాయులు, మిత్రులు, ఆదివాసీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.





సంతోష్ కుమార్, సాధించిన కాంస్య పతకం

## రా రైస్ ఇవ్వలేం..

**కలెక్టర్‌కు విన్నవించిన 40 మంది జిల్లా రైస్ మిల్లర్లు**

ములుగు, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని దిగుమతి చేసుకొని మిల్లింగ్ ద్వారా రా రైస్‌ను ప్రభుత్వానికి తిరిగి ఇవ్వలేమని జిల్లా రైస్ మిల్లర్లు సోమవారం కలెక్టర్ టీఎస్ దివాకరకు తేల్చి చెప్పారు. ప్రజావాణిలో భాగంగా జిల్లాకు చెందిన 40 మంది రైస్ మిల్లర్లు వేర్వేరుగా కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియలో బాయిల్డ్ బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వానికి చెల్లించేదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నందున యాసంగి సీజన్‌లో వచ్చే ధాన్యం నుంచి రా రైస్‌ను ఇవ్వాలని నిబంధనలు పెట్టిందన్నారు. అధిక ఉష్ణోగ్రతలతో యాసంగిలో పండే ధాన్యం నుంచి అనుకున్న మేర రా రైస్ రావనే విషయం ప్రతీ ఒక్కరికి తెలుసన్నారు. అయినప్పటికీ జిల్లాలోని సివిల్ సప్లయ్ అధికారులు మిల్లర్లపై ఒత్తిడి చేసి ధాన్యం దిగుమతి చేసుకొని రా రైస్ పెట్టాల్సిందేనని ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వారి ఒత్తిడి మేరకు ధాన్యం దించుకుంటే రైస్ మిల్లర్లు దివాల తీసి డిఫాల్టర్‌లుగా మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల బెదిరింపుల నుంచి విముక్తి కల్పించాలని రైస్ మిల్లర్లు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేసినట్లు చెప్పారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి సహోదర్‌రెడ్డి, కోశాధికారి మోహన్, ఆర్గనైజర్ సెక్రటరీ హరినాథ్, ఉపాధ్యక్షులు సుదర్శన్‌రెడ్డి, రఘోత్తం, సహాయ కార్యదర్శులు భద్రయ్య, వీఎన్ రెడ్డి, జిల్లాలోని రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.



కలెక్టర్ దివాకరకు వినతిపత్రం ఇస్తున్న రైస్ మిల్లర్లు

## యువత సన్మార్గంలో నడవాలి

**భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే**

పలిమెల, ఏప్రిల్ 28 : యువత సన్మార్గంలో నడవాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అంతర్ రాష్ట్ర సరిహద్దు జిల్లాలు గడ్చిరోలి, బీజాపూర్, ములుగు, భూపాలపల్లి జిల్లాల పరిధిలోని క్రీడాకారులకు ప్రజా భరోసా వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను మండలకేంద్రంలో సోమవారం ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడారు. అనంతరం మాట్లాడుతూ సరిహద్దు ప్రజలు, యువత మమేకమవ్వడమే ప్రజా భరోసా టోర్నమెంట్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మండలంలో త్వరలోనే మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. యువత మావోయిస్టుల మాయ మాటలు నమ్మవద్దని, సంఘ విద్రోహులకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ టోర్నీలో మహారాష్ట్రలో గడ్చిరోలి, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, తెలంగాణలోని భూపాలపల్లి, ములుగు జిల్లాలకు చెందిన మొత్తం 105 టీంలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, ఏఆర్ అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, మహదేవపూర్, కాటారం సీఐలు రామచందర్‌రావు, నాగార్జునరావు, ఎస్సైలు రమేశ్, పవన్, తమాషారెడ్డి, మహేందర్, నరేశ్, శ్రీనివాస్, ప్రజలు పాల్గొన్నారు.

**న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ**

భూపాలపల్లి రూరల్ : జిల్లా నూతన ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన సీహెచ్ రమేశ్‌బాబును సోమవారం జిల్లా కోర్టులో ఎస్పీ కిరణ్‌ఖరే మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయ, రక్షణ సంబంధిత విషయాలపై వారు చర్చించారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాజు ఉన్నారు.





పలిమెల : మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్‌ఖరే

## రాములోరి తలంబ్రాలు అందజేత

గణపురం, ఏప్రిల్ 28 : భద్రాచలంలో అట్టహాసంగా నిర్వహించిన రాములోరి కల్యాణ మహోత్సవ తలంబ్రాలను సోమవారం మండలంలోని చెల్పూర్ శ్రీ రామదాసు భక్త మండలికి ఆలయ కమిటీకి అందజేశారు. గ్రామానికి చెందిన రామదాసు తిరుపతి తిరుపతమ్మ దంపతులు ధాన్యాన్ని పండించి భక్తుల సహకారంతో గోటితో వలసిన బియ్యాన్ని (తలంబ్రాలను) ఆలయానికి కల్యాణ మహోత్సవానికి ముందు అందజేశారు. కొన్నేళ్లుగా భక్తమండలి సభ్యులకు భద్రాచలం ఆలయ కమిటీ తరపున తలంబ్రాలను అందజేశారు. తలంబ్రాలను భక్తులందరికీ అందజేస్తామని తిరుపతి తిరుపతమ్మ దంపతులు తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్**

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 28 : ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణిలో 34 దరఖాస్తులు వచ్చాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో రవి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణిలో వినతుల స్వీకరణ**

ములుగురూరల్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం 53 ధరఖాస్తులు రాగా అందులో 20 భూ సమస్యలు, 7 గృహ నిర్మాణ శాఖకు, పింఛన్ 1, ఉపాధి కల్పనకు 6, ఇతర శాఖలకు 19 వచ్చినట్లు తెలిపారు.

**ఇండ్ల ఎంపికలో గ్రామ సభ నిర్వహించలేదు**

గోవిందరావుపేట మండలం దుంపిల్లగూడెం గ్రామానికి చెందిన లెంకలపల్లి కుమారస్వామి దివ్యాంగుడినైన తనకు అధికారులు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదని ఫిర్యాదు చేశాడు. జీపీ కార్యదర్శి ఎలాంటి గ్రామ సభ నిర్వహించకుండా లబ్ధిదారులును గ్రామ పెద్దల సమక్షంలో ఎంపిక చేశారన్నారు. అర్హుడినైన తనను ఎంపిక చేయని ఎంపీడీవో వద్దకు వెళితే కాంగ్రెస్ నాయకులను కలువమని చెప్తున్నారని ఆరోపించారు. అలాగే గ్రామంలో రేషన్ షాపు నంబర్ 9ని నడుపుతున్న డీలర్ సన్న బియ్యం ప్రజలకు ఇవ్వకుండా కిలోకు రూ.10 చొప్పున నగదు ఇస్తున్నాడని, దీనిపై కూడా ఫిర్యాదు చేసినట్లు వివరించాడు.



ములుగు రూరల్ : అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సతీశ్

**ఆక్రమించిన ఇంటి స్థలం స్వాధీన పర్చాలి**

ములుగు జీపీ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో ఆక్రమించిన ఇంటి స్థలాన్ని స్వాధీన పర్చాలని కోరుతూ గ్రామానికి చెందిన కాకి సతీశ్ అదనపు కలెక్టర్ వినతిపత్రం అందజేశారు. గ్రామంలో దళితులకు ప్రభుత్వం ఒకే చోట 30 గుంటల భూమిని గతంలో ఆరు కుటుంబాలకు కేటాయించారని, ప్రస్తుతం తమ భూమి నిగ్రామానికి చెందిన చల్లగొండ రామచంద్రారెడ్డి, అతని కుమారులు ఆక్రమించి జీపీ ద్వారా ఇంటి నంబర్లు తీసుకున్నారన్నారు. ఇంటి నంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకొని తమను ఇబ్బందులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. విచారణ చేసి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు.

**గిరిజన దర్బార్‌లో వినతులు**

ఏటూరునాగారం : ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన గిరిజనులు ఏవో రాజ్‌కుమార్‌కు వినతిపత్రాలు అందజేశారు. గిరిజన మత్స్యకారులకు వలలు, తెప్పలు, అందించాలని, చేపల మార్కెట్ యార్డు ఏర్పాటు చేసుకునేందుకు ఐటీడీఏ తరపున ఐదు ఎకరాల భూమి కేటాయించాలని మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిద్దబోయిన సురేందర్, ఆలం భాస్కర్ వినతిపత్రం ఇచ్చారు. ఐటీడీఏ పరిధిలో ఉన్న ఫిష్ పాండ్స్‌ను చేప పిల్లల ఉత్పత్తికి గిరిజన మత్స్య సంఘాలకు కేటాయించాలని కోరారు. తన భర్త పేరిట ఉన్న పట్టా భూమిని ఇతరులు ఆక్రమించుకున్నారని తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలని మంగపేట మండలం రమణక్కపేటకు చెందిన పడిగ సంధ్య కోరారు. గంగారం మండలానికి చెందిన ప్రశాంత్ తమ ఖాతాలో పెండింగ్‌ను క్లియర్ చేసి అందులో ఉన్న డబ్బులు తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. మేనేజర్ శ్రీనివాస్, అధికారులు మహేందర్, కొమురం ప్రభాకర్, శిరీష్, ప్రభాకర్ పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్ : దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అశోక్ కుమార్



ఏటూరునాగారం : వినతిపత్రం ఇస్తున్న మత్స్యకారులు

## మేడే వేడుకలను విజయవంతం చేయాలి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 28 : జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే మేడే వేడుకలకు కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బందు సాయిలు పిలుపునిచ్చారు. సోమవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ మే 1న జిల్లాలోని కార్మిక వర్గం ఐక్యంగా కదిలి మేడేను దీక్షా దినంగా జరుపుకోవాలని కార్మికుల అడ్డాల వద్ద జెండాలు ఎగరేసి గ్రామాలు మండల కేంద్రాలు, జిల్లా కేంద్రంలో జరిగే ర్యాలీలు సభల్లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో వివిధ అనుబంధ సంఘాల నాయకులు వీ రాజయ్య, ఆకుదారి రమేశ్, సీహెచ్ రవికుమార్, బండారి బాబు పాల్గొన్నారు. అలాగే కేటీకే –2 ఇంక్లైన్‌లో ఏఐటీయూసీ భూపాలపల్లి బ్రాంచ్ సెక్రటరీ మోటపలుకుల రమేశ్ ఆధ్వర్యంలో మే డే పోస్టర్ ఆవిష్కరించారు. అన్ని గనులు, డిపార్ట్మెంట్లలో వేడుకలను ఘనంగా జరుపుకోవాలని కోరారు. అలాగే కేటీకే ఓసీ –2, కేటికే ఓసి–3, భూపాలపల్లి ఏరియా ఆసుపత్రి ఆవరణలో మే డే గోడ పత్రికలను ఆవిష్కరించారు. అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జి శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీ సదయ్య, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ నరేశ్, ఎల్ శంకర్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

తాడ్వాయి, ఏప్రిల్ 28 : వేములవాడకు వెళుతున్న ఆటోను ఎదరుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం డీకొట్టడంతో గోరంట్ల శంకర్ (48) అనే వ్యక్తి మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలకేంద్రం సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని గోపాల్‌రావుపేటకు చెందిన శంకర్ తన కుమారులు శ్రీకాంత్, మహేశ్‌తో పాటు కోడళ్లు, తమ్ముడి కొడుకు సునీల్‌కుమార్‌తో కలిసి వేములవాడకు కరకగూడేనికి చెందిన శిరాత్రి సాగర్‌కు చెందిన ఆటోలో బయలుదేరారు. కాటాపురం దాటి మండలకేంద్రానికి సమీపంలోకి వచ్చిన అనంతరం తెల్లవారుజామున ఎదరుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఆటోకు ఒకపక్క వేగంగా ఢీకొట్టింది. డ్రైవర్ ప్రక్కనే కూర్చున్న శంకర్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందగా సునీల్‌కుమార్, మహేశ్, శ్రీకాంత్‌కు స్వల్పగాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వాహనం ఆగకుండా వెళ్లిపోయినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

## వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

ములుగురూరల్, ఏప్రిల్ 28 : మే 1 నుంచి జూన్ 6 వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అధికారి తుల రవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారీగా 10 రకాల క్రీడల్లో శిబిరాలను కేటాయించడం పూర్తయిందన్నారు. ప్రవేశాల కోసం 73303 26241 నంబర్‌ను సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

## లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలు పాటించాలి

ములుగురూరల్, ఏప్రిల్ 28 : ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేందుకు లబ్ధిదారుల ఎంపికలో అధికారులు నిబంధనలు పాటించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికకు నియమితులైన మండల స్థాయి వెరిఫికేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులతో పాటు ఎంపీడీవోలు, జీపీ కార్యదర్శులు, లబ్ధిదారుల ఎంపికలో ఇప్పటి వరకు పాల్గొన్నారని అన్నారు. ప్రస్తుతం మండల స్థాయిలో వెరిఫికేషన్ ఆఫీసర్లు పర్యటించి కార్యదర్శులు సమర్పించిన వివరాలను తనిఖీ చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన నిరుపేదలు, ఇల్లు లేని వారిని ఎంపిక చేయాలని సూచించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ సూర్యనారాయణ, ఏపీడీ వెంకటనారాయణ, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఇంటెలిజెన్స్ ఎస్సైగా రమేశ్‌బాబు

ములుగురూరల్, ఏప్రిల్ 28 : జిల్లాలో ఎస్‌బీ ఏఎస్సైగా పనిచేస్తున్న రమేశ్‌బాబుకు పదోన్నతి లభించింది. ఆయన ప్రస్తుతం ఇంటలిజెన్స్ విభాగంలో ఎస్సైగా నియమితులయ్యారు. అలాగే ఎస్‌బీలో ఎస్సైగా పనిచేసిన శ్రీనివాస్‌రెడ్డి సీఐడీ విభాగానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం కార్యాలయ అధికారులు, సిబ్బంది రమేశ్‌బాబుతో పాటు శ్రీనివాస్‌రెడ్డిని శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ శంకర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## అక్రమ పట్టాలు రద్దు చేయాలి

ములుగురూరల్, ఏప్రిల్ 28 : ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులకు ఇచ్చిన అక్రమ పట్టాలను రద్దు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ములుగు జిల్లా కన్వీనర్ పర్షిక సతీశ్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. 1970 తర్వాత ఏజెన్సీ ప్రాంతానికి వలస వచ్చిన ఇప్పగూడెం గ్రామంలో ప్రభుత్వ భూమిలో ఇచ్చిన పట్టా పాస్ పుస్తకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వెంకటాపురం(నూగూరు) మండల పరిధిలోని వలస లంబాడీలకు ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు నిలుపుదల చేయాలన్నారు. చట్ట బద్ధత లేని లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు తొలుస కృష్ణబాబు, నాయకులు కుమ్ము సురేశ్, ఎట్టి కన్నయ్య, సుగుణ, లక్ష్మి ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఏటూరునాగారం, ఏప్రిల్ 28 : మండలంలోని రొయ్యూరు గ్రామానికి చెందిన డొంగిరి రాజేశ్ కుటుంబానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు తరపున రూ. 10వేల ఆర్థిక సాయాన్ని పార్టీ నాయకులు సోమవారం అందజేశారు. ఇటీవల రాజేశ్ అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవడంలో భాగంగా దశదిన కర్మకు లక్ష్మీ నర్సింహారావు రూ. 10 వేలు ఇచ్చినట్లు వారు చెప్పారు. నాయకులు జిట్ట ఈశ్వర్, కొండగొర్ల తిరుపతి, తీగల సమ్మయ్య, సోదరి రమేశ్, డొంగిరి లక్ష్మణ్, దుర్గం లక్ష్మణ్, సంద శ్రీనివాస్, ఆకుదారి అన్నమయ్య, చిన్న మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలి

మహదేవపూర్, ఏప్రిల్ 28 : మండలకేంద్రంలోని గిరిజన సహకార సంఘ కార్యాలయంలో అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బెల్లంపల్లి సురేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జీసీసీ ద్వారా అందే సేవలపై ఉన్నాతాధికారుల పర్యవేక్షణ లోపంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసే బాధ్యత జీసీసీకి ఉన్నప్పటికీ ఆదిశగా అడుగులు వేయకపోవడంతో గిరిజనులు ఉపాధి కోల్పోతున్నారని తెలిపారు. జిల్లా ఉన్నాతాధికారులు స్పందించి జీసీసీపై సమగ్ర విచారణ చేపట్టి అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా అంతర్జాతీయ సహకార దినోత్సవం

గణపురం/ మహాముత్తారం/ మహదేవపూర్/ మల్హర్, ఏప్రిల్ 28: అంతర్జాతీయ సహకార దినోత్సవం పురస్కరించుకొని సోమవారం గణపురం, చెల్పూరు, మహదేవపూర్, మల్హర్ మండలం తాడిచర్ల పీఏసీఎస్‌ల చైర్మన్లు కన్నెబోయిన కుమార్‌యాదవ్, గండ్ర సత్యనారాయణరెడ్డి, చల్ల తిరుపతిరెడ్డి, ఇప్ప మొండయ్య, మహాముత్తారం పీఏసీఎస్ సీఈవో శ్రీధర్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు అందిస్తున్న వివిధ రకాల సంక్షేమాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో డైరెక్టర్లు చిన్న రాజయ్య, సుజాత, సమ్మక్క, జిల్లా సహకార శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్ రిలీఫ్ రెడ్డి, మహదేవపూర్ పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎనమండ్ర వామన్‌రావు, మాజీ సర్పంచులు కోట రాజబాబు, అక్బర్ ఖాన్, పాలక వర్గ సభ్యులు ఎండీ ఇబ్రహీం, చీర్ల తిరుపతిరెడ్డి, సీఈవో కుమ్మరి రాజబాబు, హమాలీ సంఘం నాయకులు బాలయ్య, ధర్మయ్య, తాడిచెర్ల పీఏసీఎస్ వైస్ చైర్మన్ మల్క సూర్యప్రకాశ్ రావు, రమేశ్, తిరుపతిరావు, సురేశ్, సర్వనాయక్, రామన్న, కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాస్, రాజయ్య, రాజయ్య, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ వెంకటరాజం, సీఈవో సంతోష్, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.